


# 'ఆత్మ'హత్య

కండ్లకుంట శరత్‌చంద్ర

**నీతికీ - అవినీతికీ, పుణ్యానికీ - పాపానికీ, మంచికీ - చెడుకూ, శృంగారానికీ - విశృంఖలత్వానికీ, భయానికీ - ధైర్యానికీ, ఇలా... పరస్పర వ్యతిరేకమైన విషయాలను అవగాహనలోకి తీసుకొని తరచి చూస్తే, ఆ రెంటికీ మధ్య ఒకే ఒక సన్నని 'తెర'లాంటి, కనిపించీ కనుపించని 'పొర' ఉంటుంది.**

అలాగే చావుకూ - బ్రతుకుకూనూ. నిర్జీవమైనటువంటి దేహాన్ని మరణించిందంటాం. కానీ ఈ విషయాన్ని ససేమిరా ఒప్పుకోడు సీతారామయ్య! అందుకతడ్ని పిచ్చివాడిగా జమకట్టినా సరే! ఛస్తే ఒప్పుకోడతడు. పైగా... దాన్ని ఋజువు చేయడానికి ఉదాహరణ తనేనంటాడు.

ఇప్పుడతని వయస్సు అరవైరెండు దాటింది. టీచర్‌గా రిటయిరయ్యాడు. "హాయిగా, ఆనందంగా జీవించండి" , "విష్ యూ ఏ హాపీ లైఫ్" లాంటి వాక్యాలు అతనితో ఎవరైనా అంటే, నవ్వుకుంటాడు. ఆ నవ్వుకు అర్థం ఎవ్వరికీ తెలీదు. తను చచ్చిపోయానని అతని అభిప్రాయం. చావంటే మామూలు చావు కాదు. ఘోరాతిఘోరంగా... హీనాతిహీనంగా... పలుమార్లు చనిపోయానంటాడు. కొన్నిసార్లు హత్య చేయబడ్డాడుట. మరికొన్నిసార్లు 'ఆత్మ'హత్య చేసుకున్నాడట.

మనుషులందరికీ...మనసుందో లేదో గానీ తనకు మాత్రం మనసుందంటాడు. అందుకే చచ్చానంటాడు. ఒకటి రెండు సార్లు అతడ్ని కూరగాయల మార్కెట్‌లో చూశాను. ఇంకోసారి మార్నింగ్ వాక్‌లో కలిసి మాట్లాడాను. అతనితో రోజూ మాట్లాడాలనే ఉద్దేశ్యంతో, ఇప్పుడు ప్రతిరోజూ మార్నింగ్‌వాక్‌కు వెళ్తాను. క్రమం తప్పకుండా ప్రతిరోజూ, అతడు నాతో ఓ అరగంటసేపు పార్కులోని పచ్చగడ్డిలో కూర్చుని మాట్లాడతాడు. నాతో... అన్నీ నిస్సంకోచంగా చెప్తాడు, కానీ, ఈ రోజు అతని చావు విషయం చెప్పాడు.

000

"సార్! పాపం అమెరికాలో ఎంత ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించిందో కదండీ! అంతమంది ఒకేసారి చనిపోవడం... ఘోరం!" అన్నాన్నేను.

అతడు నవ్వాడు. ఆ నవ్వు నాకు తప్ప మరింకెవరికైనా అర్థమైతే ఒట్టు. 'నోర్ముయ్యరా! అజ్ఞాని' అని ఆ నవ్వుకు అర్థం.

"ఏమండీ! అ... నవ్వు నవ్వుతున్నారు. అంతమంది చనిపోవడం ఘోరం కాదూ...!" మళ్లీ అన్నాను.

ఇప్పుడతడు పొరలు పొరలుగా, తెరలు తెరలుగా నవ్వాడు.

"నేను చచ్చిపోయినవాడ్నే! మరి, నన్ను చూసి జాలిపడవేం!" అన్నాడతడు.

నేను షాక్ తిన్నట్లు చూశాను. అతను, నాతో ఎప్పుడూ పరాచికాలాడలేదు. ఏ నిగూడార్థం లేకుండా... పనికిరాని ఊసుకబుర్లు కూడా నాతో

మాట్లాడినట్లు గుర్తులేదు.

మళ్లీ, తనే ప్రారంభించాడు.

000

మొదటిసారిగా, నేను, బడిలో ముందువరుసలో కూర్చునే మంగతాయారు బాక్స్‌లోని పెన్సిల్ దొంగతనం చేశాను. తను బాగా ఏడ్చింది. పంతులుగారు అందరినీ అడిగారు. ఎవ్వరమూ తియ్యలేదని చెప్పాం. దాంతో కోపమొచ్చి కర్ర తీసుకుని అందరినీ బాదారు. "దొంగతనం పాపమని" నాకు ఒకటవ తరగతి పుస్తకంలో చదువుకున్నప్పుడే తెలుసు. కానీ... తప్పనిసరై చేశాను. ఆ రోజు నేను మొదటిసారిగా చనిపోయానని నాకప్పుడు తెలియదు.

బి.ఏ.లో పరిచయమైన మేరీని ప్రాణప్రదంగా ప్రేమించాను. కానీ ఆమెను ప్రేమించిన సంగతి, తనకు చెప్పలేదు. ఇద్దరం కలిసి తిరిగేవాళ్లం. తను, నన్ను ప్రేమిస్తున్న సంగతీ, నేను తనను ప్రేమిస్తున్న సంగతీ, ఇద్దరికీ తెలుసు. కానీ ఇద్దరం నోరు విప్పి చెప్పుకోకపోయేవాళ్లం. అదంతా మౌనభాష.

కాలేజీ చదువు ముగిసింది. చివరిరోజు తనే, నాతో ధైర్యంగా కాగితంలో వ్రాసి తన ప్రేమను వెల్లడించింది. కులం, ఆచార సాంప్రదాయాలు అన్నీ, మరీ చూసి నాకు జానకితో పెళ్లి నిశ్చయించారు. మానాన్న మాటకు అడ్డు చెప్పే సాహసం చెయ్యలేకపోయాను. పెళ్లి చేసుకున్నాను. మేరీ బావిలో దూకి చనిపోయిందని తెలిసింది. కారణం నాకు తప్ప మరింకెవరికీ తెలీదు. ఆరోజే నేను నైతికంగా రెండోసారి చనిపోయాను.

టీచరు ఉద్యోగం దొరికింది. సంవత్సరాలు దొర్లాయి. ఇద్దరు కొడుకులు, ఓ కూతురు పుట్టారు. మా అక్కయ్యల పెళ్లిళ్ల కోసం నాన్న చేసిన అప్పులు పెరిగిపోయాయి. నాన్న చనిపోయారు. అప్పులవాళ్లు మా పొలాలను స్వాధీనం చేసుకున్నారు.

అమ్మనూ, భార్యాపిల్లలనూ తీస్కొని, ఉద్యోగం చేస్తూ... ఎక్కడికి ట్రాన్స్‌ఫరైతే అక్కడికి తిరుగుతూ, పిల్లల్ని చదివిస్తూ, కాలం గడిపేవాడ్ని. అమ్మకు పక్షవాతం వచ్చింది. సరైన మందులిప్పించక ఆమెను ఏడెనిమిదిసార్లు చంపాను. ఆఖరుకు దేవుడు తనను కరుణించడంతో ఓ శుభముహూర్తాన నాన్న దగ్గరకు వెళ్లిపోయింది.

ఆదాయం తక్కువ. అవసరాలు ఎక్కువ. భార్యాపిల్లల కోరికలు తీర్చాలి. ఎలా? లెక్కల మాష్టారినైన నేను, స్కూల్లో తక్కువగా చెప్పేవాడ్ని. కావాల్సినవాళ్లను డబ్బులిచ్చి నా దగ్గరకు ట్యూషన్‌కు రమ్మనేవాడ్ని. మొత్తం మీద, ట్యూషన్ల డబ్బులతోను జీవితం నడిచింది. ఈ పని చేసినందుకు, నన్ను నేనే హత్య చేసుకున్నాననే విషయం నాకు తెలుసు.

మనసుపడే బాధ అంతా ఇంతా కాదు. ఈ విషయం భార్యకో, స్నేహితులకో చెప్తే పిచ్చివాడ్ని చూసినట్లు చూసి నవ్వుతారు. 'ఎన్నో కోచింగ్ సెంటర్లు, కాలేజీలు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ బ్రతుకుతున్న ఈ తరుణంలో నువ్వు చేసేది తప్పే కాదు' అన్నారు వాళ్లంతా.

'అంతెందుకు మీ ఇద్దరబ్బాయిలను ఇంజనీరింగ్‌లో చేర్చావు. అమ్మాయిని మెడిసెన్ కోచింగ్‌కు పంపావు. వాటన్నిటికీ డబ్బు కట్టావు. ఎలా? నీ దగ్గర, వాళ్లు ఫీజులు వసూలు చేస్తారు. చేతనయినంతలో నువ్వు ఇంకొకరి దగ్గర ఈ పని చేస్తావు. అందులో తప్పేలేదు' అని కూడా అన్నారు.

వేదాలు, ఉపనిషత్తులు చదువుకున్నవాడ్ని. 'విద్యాదానం మహాదానం' లాంటి పరమసత్యాలను బట్టీయం వేసినవాడ్ని... ఎలా! ఎలా! నామనసు వాళ్లకు అర్థంకాదు. నా 'చావు' వాళ్లకు అర్థం కాదు. నేను పిచ్చివాడినట!

మా అబ్బాయిలిద్దరికీ పెళ్లిళ్లు చేశాను. కట్నం తీసుకోవద్దనే జాతిలో నేనున్నాను. పెళ్లంటే, డబ్బులిచ్చి పుచ్చుకునే వ్యాపారం కాదని, రెండు మనసుల కలయిక అని, గురజాడ వారి అభిప్రాయాలను పుణికిపుచ్చుకున్నవాడ్ని. నాభార్య వినలేదు. పైగా... "అబ్బాయిలిద్దరికీ కట్నం, ఖచ్చితంగా తీసుకుందాం! రేపు అమ్మాయికి కట్నం ఇవ్వాల్సిందే...! లేకపోతే పెళ్లి సంబంధాలు రావు. ఒకవేళ వచ్చినా, దాన్ని రాచిరంపాన పెట్టేవాళ్లే వస్తారు. అంతెందుకు! మన పెళ్లికి కూడా... మానాన్న, మీనాన్నకు కట్నం ఇచ్చాడు. గుర్తు తెచ్చుకోండి" అంది.

నా పెళ్లి జరిగిన కాలం వేరు. జానకిని నేను మొదటిసారిగా పెళ్లిపీటల మీదే చూశాను. ఇచ్చిపుచ్చుకోవడాల గురించి పిల్లలకు తెలీదు. పెద్దవాళ్లను ఎదిరించి మాట్లాడే ధైర్యం ఆనాడు ఎవ్వరికీ ఉండేదికాదు. కానీ ఇప్పటి కథే వేరు. అబ్బాయిలను, కట్నంకోసం, పెద్ద చదువులు చదివించే ప్రబుద్ధులు, తల్లిదండ్రులు. అబ్బాయిలూ అలాగే తయారయ్యారు.

ఇక మా అమ్మాయి సంగతి. ఒకవేళ కట్నం బాగా ముట్టజెప్పి వివాహం జరిపించినా... దాన్ని రాచిరంపాన పెట్టనివాళ్లు దొరకరని గ్యారంటీ ఏమిటి? ఏదేమైనా, నాభార్య నామాట వినదు. మొత్తం మీద ఈ విషయంలో నేను రెండు సార్లు 'ఆత్మ'హత్య చేసుకొని అబ్బాయిల పెండ్లిండ్లు చేశాను.

వాళ్లిద్దరూ నా ఆశయాలనూ, నన్నూ హత్య చేసి పెళ్లాలతో ఫారిన్‌లో సెటిలయ్యారు. నాకేమీ అర్థంకాలేదు. వాళ్లను కనీపెంచీ, వాళ్ల అవసరాలు తీర్చడానికి, నన్ను నేను ఎన్నోసార్లు చంపుకుని, వాళ్లను చదివించీ, పెళ్లిళ్లు చేస్తే... వాళ్లు చేసిందేమిటి?

'భారతదేశం!' 'భ' అంటే భావం. 'ర' అంటే రాగం. 'త' అంటే తాళం. వేదభూమి మనది. పరమపవిత్రమైన నదీజలాలతో విలసిల్లే... పుణ్యభూమి ఇది. దీన్ని విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లి స్థిరపడిపోయి, అక్కడే చచ్చేదాకా బ్రతకాలని నిర్ణయించుకునే ఈ తరం పిల్లల్ని చూస్తుంటే నాకు అసహ్యం వేస్తుంది.

డబ్బు సంపాదన కొరకు దూరప్రదేశాలకు వెళ్లడం మా కాలంలోనూ ఉండేది. కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటి? తల్లిదండ్రుల్ని వదిలేసి ఫారిన్‌లో స్థిరపడిపోవడం. కనీపెంచి చదివించిన తల్లిదండ్రుల మీద 'ప్రేమ' లేదు. అన్నీ యాంత్రిక జీవితాలు.

మా అమ్మాయి 'పూర్ణిమ'ను అల్లారుముద్దుగా పెంచాం. కానీ... ఎప్పుడూ మామాట వినేదికాదు. అన్నీ తను అనుకున్నట్లే జరగాలి. జరిపించాం కూడా ! తనిప్పుడు



చికాగోలో డాక్టర్! మొగుడు, పిల్లలతో అక్కడే సంసారం వెలగబెడుతోంది. ఓ దసరా లేదు, దీపావళి లేదు. 'మదర్స్‌డే' రోజు మాత్రం జానకి పేరున ఓ గ్రీటింగ్ ముక్క పంపుతుంది.

నేను రిటైరయ్యాను. పెన్షన్ కోసం మొహాలు వేలాడేసుకుని రోజులూ, నెలల తరబడి ప్రభుత్వ కార్యలయాల ముందు పడిగాపులు కాసేవాళ్లు ఎందరో ఉన్నారు. నేను మాత్రం అందరికీ తగినన్ని 'బరువులు' అందించి, సంతృప్తి పరచి, కేవలం నెలరోజులలో పెన్షన్ సాంక్షన్ చేయించుకోగలిగాను. ఈ విషయం మా మిత్రులూ, నా భార్యా ఎంతో గొప్పగా 'ప్రభుత్వ ఆఫీసులలో కేవలం నెలరోజులలో పని చేయించుకోగలిగిన కార్యదక్షుడ'నని నా గురించి గర్వంగా చెప్పుకుంటారు.

ఆల్రెడీ, లంచాలు తినిపించి, పని చేయించుకున్నందుకు నన్ను నేను మరోసారి ఆత్మహత్య చేసుకున్నానే... అని బాధపడుతుంటే... వీళ్ల పొగడ్తలతో... నన్ను పదే... పదే... ఘోరంగా హత్య చేశారు.

నా జి.పి.ఎఫ్‌లో క్రెడిటైన డబ్బులు, మొత్తం రెండు లక్షలు. అవి ఇంకో వారంలో చేతికొస్తాయనగా మా అక్కయ్యలిద్దరూ దిగారు. ఎప్పుడూ లేని ప్రేమ మామీద ఒలకబోసారు. అది నిజం ప్రేమో, కల్తీ ప్రేమో నా భార్య చెప్తే కాని అర్థం కాలేదు.

"ఏమండీ! వాళ్లు డబ్బుల కోసం వచ్చారు" అంది.

"పోనీ లేవే! వాళ్లూ మనింటి ఆడపిల్లలేగా. ఐనా మనం మాత్రం అంత డబ్బు ఏం చేసుకుంటాం! బాధ్యతలు కూడా మనకేం లేవాయె!" అనేసి, వచ్చిన డబ్బులోంచి చెరో యాభైవేలు వాళ్ల చేతిలో పెట్టాను. మా తమ్ముడు దానకర్ణుడు. అన్నీ నాన్న బుద్ధులే! అంటూ పొగుడ్తూ వెళ్లిపోయారు.

నాభార్య తీవ్రంగా అస్వస్థతకు గురైంది. ఒక్కడినే ఎంతని చూసుకోగలను. పిల్లలూ దగ్గర లేరాయె. మా అక్కయ్యలిద్దరికీ విషయం తెలిపి, రమ్మని రాస్తే "తమ్ముడూ! మేం ఓ నెలరోజులు ఉత్తర భారతదేశ యాత్రకు వెళ్తున్నాంరా! వచ్చాక, వీలుంటే తప్పక రావడానికి ప్రయత్నిస్తాం!" అని రెండు కార్డు ముక్కలతో నన్ను ఘోరాతిఘోరంగా హత్య చేశారు. ఎలాగో తంటాలు పడి భార్యను బ్రతికించుకున్నాను.

పనికిరాని చెత్తవిషయాలను, గొప్ప విషయాలుగా కీర్తించే... ఈ సమాజంలో... నాలా చనిపోయినవారు ఎందరో ఉన్నారు. నైతిక విలువలకూ, మానవతా విలువలకూ విలువివ్వడం తెలీని ఈ మనుషులు, బ్రతికుండగానే చచ్చారు. కేవలం కుటుంబమే నా సామ్రాజ్యం! కుటుంబం బావుంటే చాలునని బ్రతికున్న నాలాంటి మనుషులు చచ్చినట్లే లెక్క!

నా మనసులో ఎగసిపడే అలల శబ్దం ఎవ్వరికీ వినిపించకపోవచ్చు. నా మనసులోని, రక్తసిక్తమైనా కత్తిపోట్ల గాయాల నొప్పి ఎవ్వరికీ తెలియకపోవచ్చు. కానీ... 'మనసంటూ' ఉంటే... 'ఉన్న' ప్రతీ వ్యక్తికీ తెలుసు... తను ఎన్నిసార్లు చనిపోయాడో...!

000

"ఇప్పుడు చెప్పు! నన్ను ఎవరిగురించి జాలిపడమంటావు. ఆకస్మికంగా మరణించిన ఆ... వ్యక్తుల గురించా! క్షణక్షణం చస్తూ బ్రతికే... ఈ 'బ్రతికున్న మనుషుల' గురించా!" చెప్పి లేచాడు.

నేను ఇంకేదో మాట్లాడదామనుకున్నాను. కానీ... నా గొంతు జీరబోయింది. మనసు శూన్యమైంది. అతడు వెళ్లిపోయాడు.

నేను ఇంటికొచ్చాను. ఇప్పుడేం చేస్తున్నానంటారా!

ఇప్పటివరకూ, నేనెన్ని సార్లు చనిపోయానో, ఎన్నిసార్లు చంపబడ్డానో... ఎన్నిసార్లు 'ఆత్మ'హత్య చేసుకున్నానో... లెక్కబెట్టుకుంటున్నాను. ■

